క్లుప్తంగా

ఆత్మీయ సన్మానం



నెల్లూరు(దర్గామిట్ట) : ఎంపీడీఓ కేవీ శివప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగిగా వివిధ స్థాయిలో శివప్రసాద్ అందించిన సేవలు ఆదర్శనీయమన్నారు. శేషజీవితం హాయిగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది, శివప్రసాద్ బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

మాలలకు న్యాయం చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే మాలలకు న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వి.వెంకటరమణ అన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా మాలలకు ఎంత శాతం రిజర్వేషన్ ఇస్తారనేది రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని, పెరిగిన ఎస్సీ జనాభా ఆధారంగా రిజర్వేషన్‌ను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో నాయకులు శైలేంద్రబాబు, రవిచంద్ర, అశోక్ కుమార్, నారాయణ, ప్రవీణ్‌కుమార్, సుమన్‌తేజ, మేరీ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ

నెల్లూరు(బృందావనం) : స్థానిక మైపాడురోడ్డు వైకుంఠపురం కాశీనాయన ఆశ్రమంలో కొలువైన కనకదుర్గమ్మ తల్లి శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్ రజనీ, భార్గవి, పద్మజ, అనిత, మహాలక్ష్మి, హేమచంద్ర, కృష్ణారెడ్డి, మురళీ, మహేష్ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం 10,500 హెక్టార్లు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో 10,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం రైతులు చేపట్టేలా జిల్లా ఉద్యానశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ శనివారం ఆదేశించారని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు భారీ లక్ష్యాలను కేటాయించిందన్నారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో రూ.76.57 కోట్లతో ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.41.47 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ రూ.27.65 కోట్లు, రైతుల వాటా రూ.7.46 కోట్లుగా ఖర్చు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సూక్ష్మసేద్యానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీరోడ్లకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్ గ్రామిక నగర్‌లో సుమారు రూ.33 లక్షల నిధులతో సీసీరోడ్లు, కల్వర్టు పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మాన్నేపల్లి రఘు, కూకటి హరిబాబు యాదవ్, అత్తివరపు యాదయ్య, బత్తల కృష్ణ, పల్నాటి మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కేరళలో వయనాడ్ బాధితుల కోసం నెల్లూరు సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి స్టోన్‌హౌస్‌పేట మీదుగా పలు దుకాణాల్లో విరాళాలు సేకరించారు. సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ శనివారం ఒక గంటలో రూ.13,928 నగదును సేకరించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నగరంలోని మైపాడుసీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దర్గామిట్ట విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శోధన్ నగర్, అరవిందనగర్, జిల్లాకోర్టు పరిసర ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

పాస్టర్స్ అసోసియేషన్‌లో నెల్లూరీయులు

నెల్లూరు(బృందావనం) : రాష్ట్ర పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నెల్లూరీయులు ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరు నగరానికి చెందిన పాస్టర్ ఐ.ఎస్ బెన్హర్‌బాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నెల్లూరు రూరల్‌కు చెందిన పాస్టర్ బుర్రి ఏసురత్నం ఎన్నికయ్యారు.







ఫ్లై ఓవర్ ఎక్కితే... వాహనదారులకు ఇక్కట్లే

నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ గుండా నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన ఐరన్ ప్లేట్లు, అమర్చిన నట్లు, రబ్బర్ బెల్టులు ప్రస్తుతం ఊడిపోయాయి. దీంతోపాటు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ వంతెనపై మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

– ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నీటి వనరుల ఆవశ్యకతపై ర్యాలీ



బారాషహీద్ దర్గాలో ఎన్‌సీసీ క్యాడెట్లు

నెల్లూరు (టౌన్) : నీటి వనరుల ఆవశ్యకత, పరిశుభ్రత అనే అంశంపై పదో ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని కలెక్టర్ బంగ్లా నుంచి పోలీస్ గ్రౌండ్ వరకు ర్యాలీ జరిగింది. ఆరోగ్యానికి భద్రత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం, భూగర్భ జలాలను భావితరాలకు అందిద్దాం అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. అనంతరం బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారాలను శుభ్రం చేశారు. ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, సీవీ నాగరాజు, కేఎన్నార్ స్కూల్, వెంగళరావు నగర్‌లోని మున్సిపల్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

హౌసింగ్‌లో పదోన్నతులు కల్పించాలి

- మంత్రి పార్థసారథికి వినతి పత్రం అందజేసిన ఇంజినీర్లు



మంత్రికి వినతిపత్రం ఇచ్చి మాట్లాడుతున్న హౌసింగ్ శాఖ ఇంజినీర్లు

నెల్లూరు (అర్బన్): హౌసింగ్ శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని, అందుకు సంబంధించిన ఫైల్‌ను నడపాలని ఆశాఖ ఏపీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ మనోజ్ కుమార్ మంత్రి కొలుసు పార్థసారథిని కోరారు. ఆయన తిరుమల వెళ్తూ మార్గమధ్యంలో నెల్లూరులోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో శనివారం కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన హౌసింగ్ శాఖ ఇంజినీర్లు ఆయనకు వినతి పత్రం అందజేశారు. పదోన్నతులతో పాటు రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వంద శాతం అడ్మిషన్లు జరిగేలా చర్యలు

- బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): 2024 –25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని అన్ని బీసీ సంక్షేమ హాస్టళ్లలో నిర్దేశించిన మేర అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి వై వెంకటయ్య సూచించారు. నెల్లూరులోని బీసీ అధ్యయన కేంద్రంలో జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని హాస్టళ్లలో అడ్మిషన్లు నూరుశాతం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా అన్ని హాస్టళ్లలో బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలన్నారు. నిర్దేశించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ రమణయ్య, కావలి డిప్యూటీ ఇంజినీర్ సుబ్బారావు, నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు సహాయ బీసీ సంక్షేమ అధికారులు, జిల్లాలోని బీసీ హాస్టళ్ల వార్డెన్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్ఐఓ, అధికారులు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత అవయవ దానంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ అవయవదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు ప్రసాదించవచ్చన్నారు. అనంతరం ఎన్‌డీసీ, ఆర్బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారులు సుధీర్‌కుమార్, డాక్టర్ భాస్కర్ అవయవ దానానికి పాటించాల్సిన జాగ్రత్తలు, పరిమితులు, పద్ధతులను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు వెంకటరావు, కృష్ణ, తులసి, శ్రీధర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రేలా మెడికల్ సెంటర్ ప్రారంభం

నెల్లూరు (అర్బన్): నగరంలోని గాంధీబొమ్మ సమీపంలో చెన్నై రేలా హాస్పిటల్ కన్సల్టేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. హాస్పిటల్ చైర్మన్, ఎండీ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా శనివారం ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సర్జన్ డాక్టర్ సీఎంకే రెడ్డి(పూర్వ నెల్లూరువాసి) మాట్లాడారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట నమోదు తప్పనిసరి

నెల్లూరు సిటీ : పంట నమోదును రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. దొంతాలి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో అధికారులు, రైతులతో వారు శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో వరి పొలాలను సందర్శించారు. మండల వ్యవసాయాధికారి నాగమోహన్, గ్రామ వ్యవసాయ సహాయకుడు విజయసారథి రైతులతో మాట్లాడుతూ వరిలో ప్రస్తుతం నల్లి బెడద ఎక్కువగా ఉందని దీని నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా తెలిపారు.

మొక్కలు నాటడమే కాదు.. సంరక్షించండి

- అటవీ శాఖాధికారులకు సీసీఎఫ్ ఆదేశాలు

నెల్లూరు(అర్బన్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సామాజిక అటవీ శాఖాధికారులు లక్ష్యాల మేరకు మొక్కలు నాటడమే కాకుండా వాటిని తప్పనిసరిగా సంరక్షించాలని గుంటూరు నుంచి వచ్చిన సీసీఎఫ్ శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన పొదలకూరు రోడ్డులోని కార్యాలయంలో సోషల్ ఫారెస్ట్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లాలో 4.50 లక్షల మొక్కలను ఈ ఏడాది నాటాలన్నారు. అలాగే నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, యూత్ గ్రూపులకు మొక్కలు అందించాలన్నారు. సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ ఆర్.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు అమ్మకు వందనం పేరుతో ఒక మొక్క నాటించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, ఇతర ఆఫీసులకు ఉచితంగా మొక్కలు అందజేస్తామన్నారు.

నేనున్నానంటూ ఆదాల భరోసా



ఆర్ఎస్సార్‌ను పరామర్శిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పరామర్శిస్తున్న ఆదాల

నెల్లూరు సిటీ : వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ పరిధిలోని పలువురిని శనివారం కలిసి పరామర్శించారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ 20వ డివిజన్ ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యం బారిన పడి వనంతోపు సెంటర్‌లోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఆదాల వెళ్లి పరామర్శించారు. విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు స్వర్ణ వెంకయ్య, పేర్నాటి కోటేశ్వరరెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, వారాల లక్ష్మీనారాయణ, బెల్లంకొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

- 12వ డివిజన్ వావిలేటిపాడు గ్రామానికి చెందిన నాయుడు రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులను ఆదాల పరామర్శించారు. ఇటీవల నాయుడు రఘురామిరెడ్డి సతీమణి నాయుడు హైమావతమ్మ మరణించగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మొయినుద్దీన్, నాగ శ్రీనివాసులురెడ్డి, షేక్.అహ్మద్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత కీలకం

- ఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్యరెడ్డి

నెల్లూరు(బారకాసు) : అపార్ట్‌మెంట్లు, టిడ్కో గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యరెడ్డి సూచించారు. అల్లీపురంలోని టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణం, డంపింగ్ యార్డులను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా, దోమల నివారణకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని తెలియజేశారు. క్లాప్ వాహనాలు, ట్రాక్టర్లు వాటి కెపాసిటీ కన్నా తక్కువ స్థాయిలో వ్యర్థాలను తరలించడం, డంప్ చేయడాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. కొన్ని వాహనాలు సామర్థ్యం కన్నా ఎక్కువగా వ్యర్థాలను కలిగి రవాణా మార్గంలో నిబంధనలు పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పనిసరిగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, డంపింగ్ సమయంలో కూడా వాటిని విడి ప్రదేశాల్లో పోగు చేయాలని యార్డు నిర్వాహకులను ఆదేశించారు.

గర్భిణులకు ఉచిత దంత వైద్యసేవలు

నెల్లూరు (అర్బన్): తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచిత సేవలు పొందుతున్న గర్భిణులు, బాలింతలకు అదనంగా ఉచిత దంత వైద్యసేవలను కూడా అందిస్తున్నామని నారాయణ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఆస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, దంత వైద్యకళాశాల ప్రిన్సిపల్ అజయ్‌రెజినాల్డ్‌తో కలిసి మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివన్నారు. వ్యాధినిరోధకత శక్తి పెరిగి జబ్బులు రాకుండా ఉండేందుకు పుట్టిన బిడ్డకు మొదటి అర్ధగంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజి విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న, చిన్నపిల్లల డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆస్పత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, డాక్టర్ సతీష్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.వనజకుమారి, ఆస్పత్రి ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి, నర్సింగ్‌సూపరింటెండెంట్ శ్రీవాణిలు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై కొరడా



తమ పార్టీకి మద్దతు ఇవ్వలేదనో... తాము చెప్పినట్లు గతంలో వినలేదనో.. కారణం ఏదైనా చిరు ఉద్యోగులే తెలుగుదేశం పార్టీ నాయకులకు టార్గెట్‌గా నిలిచారు. చాలీచాలని జీతంతో ఇళ్లు గడుపుకుంటూ..జీవనం సాగిస్తున్న వారిపై ప్రతాపం చూపిస్తున్నారు. చిరు ఉద్యోగాలు చేసుకునేవారికి ఎవరూ అండగా రారని, ఎదురుదాడి చేయరని, మిన్నకుంటారనే భావనతో టీడీపీ చోటా నాయకుల నుంచి పెద్ద పదవుల్లో ఉన్న నాయకుల వరకు తమ మార్క్ పాలన చేస్తున్నారు. కొందరిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

- టీడీపీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడవకమునుపే కక్షసాధింపు చర్యలు
- వివిధ శాఖల్లోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్న వైనం
- మరికొందరిపై ఒత్తిళ్లు, ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకులు రోజు రోజుకు పేట్రేగిపోతున్నారు. ఇప్పటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జులుం ప్రదర్శిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నించినా... న్యాయం కోసం పోరాడినా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ శాఖల్లోని చిరు ఉద్యోగులపై కూడా వీరప్రతాపం చూపుతున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ, జీజీహెచ్, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, మెప్మా ఆర్పీలు చిరుద్యోగులు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న వారిపై టీడీపీ నాయకులు రాజీనామా చేయాలని బెదిరింపులకు దిగుతున్నారు. ఆయా శాఖల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులైన వీరిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

జీజీహెచ్‌లో...

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి(జీజీహెచ్)లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులను మానసికంగా ఒత్తిళ్లకు టీడీపీ వర్గాలు గురిచేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్నవారిపై, టీడీపీకి వత్తాసు పలకలేదనే ఉద్దేశంతో చిరు ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అందులో భాగంగా జీజీహెచ్‌లో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మనోజ్ అనే వ్యక్తిని విజయవాడకు బదిలీపై వెళ్లాలని ఉత్తర్వులు జారీ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని బదిలీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. పొమ్మనకుండా పొగపెట్టినట్లు ఉందని స్పష్టమవుతోంది. అదే విధంగా వివిధ విభాగాలకు సంబంధించి కాంట్రాక్ట్ క్రింద పనిచేస్తున్న వైద్యులు (స్పెషలిస్ట్‌లు) 18 మందిని తొలగించారు.

రాజకీయ ఒత్తిళ్లతో...

నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గంలోని వివిధ శాఖలు, విభాగాల్లోని చిరుద్యోగులను (టీడీపీకి అనుకూలంగా లేనివారు) తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు రంగం సిద్ధం చేశారు. దీంతో ఆయా శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. కనీసం తమ కుటుంబాల గురించి కూడా ఆలోచించకుండా రాజకీయకక్షతో తమపై కక్షసాధింపు చర్యలు తగునా అని ప్రశ్నిస్తున్నారు.

మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కిందిస్థాయి టీడీపీ నాయకులు తనపై మానసిక ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారు. తాను చేసిన తప్పు కేవలం టీడీపీకి ఓటు వేయలేదనే కారణం.

–ఏఎన్ఎం, నెల్లూరు నగరం,

ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు

తాను నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నాను. నన్ను గత నెల రోజుల నుంచి అధికార పార్టీ స్థానిక నేత, అధికారి ఇబ్బందికి గురిచేస్తున్నారు. నా కుటుంబానికి జగనన్న అంటే ఇష్టం. ఆయన కోసం మా ప్రాంతంలో ఓట్లు వేయించాము. ఇది మనసులో పెట్టుకుని స్థానిక టీడీపీ నాయకుడు అధికారులతో ఇబ్బందిపెట్టిస్తున్నారు.

– నగర పాలక సంస్థ కార్మికురాలు,

మీరు ఎలా పనిచేస్తారో చూస్తానంటున్నారు

గత ప్రభుత్వంలో ఉద్యోగం పొందారు కదా.. ఎలా పనిచేస్తారో చూస్తామంటూ బెదిరిస్తున్నారు. తాను ప్రభుత్వ నిబంధనలతో ఉద్యోగం పొందాను. అయినా కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగం పొందావని తొలగిస్తామని బెదిరిస్తున్నారు.

–నగరంలోని ఆశావర్కర్,

పింఛన్లతో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

నెల్లూరు సిటీ : ప్రభుత్వం ద్వారా అందే పింఛన్లతో వితంతువులు, ఒంటరి మహిళలకు ఆర్థికంగా భరోసా కలుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేక పెన్షన్లను అమలు చేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరికైనా పింఛన్లు అందకుంటే తమను సంప్రదిస్తే సంబంధింత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. బీద, బలహీన వర్గాలకు న్యాయసేవలు అందుబాటులోకి తీసుకురావడం కోసం ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి, డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.వసుమతి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుడికి అభినందన



అభిషేక్‌ను అభినందిస్తున్న రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుమన్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని భాష్యం స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి షేక్.అభిషేక్ అంతర్జాతీయ ఫీడే ర్యాపిడ్ రేటింగ్ సాధించడం పట్ల రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ అభినందించారు. స్థానిక బాలాజీనగర్‌లోని కేబీ చెస్ అకాడమీలో శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని చెస్‌లో ప్రతిభ కనబర్చిన అభిషేక్‌ను పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. తల్లిదండ్రులు షేక్.మస్తాన్, చంద్రికల కృషిని, కోచ్ కిశోర్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు.

పుస్తకాల పంపిణీ

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, బ్యాగులను శనివారం పంపిణీ చేశారు.